www.kalamdaily.com

Follow on: Kalamtelugu

కలం
ప్రజల గళం...

26-02-2026, గురువారం | పేజీలు: 2

360° SINGLE TOPIC

SINGLE TOPIC

సివిల్ సర్వెంట్లు - వివాదాలు

రాష్ట్ర పాలనలో 'ఎగ్జిక్యూటివ్ పవర్స్'తో బాస్‌లుగా వ్యవహరించే ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లు కొందరు వివాదాల్లో ఇరుక్కుంటున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగుతున్నందునో, సొంత ప్రయోజనాలు ఆశించి ఫైళ్లు క్లియర్ చేస్తున్నందునో వారికి అవినీతి మచ్చ అంటుతున్నది.

పాలకుల ఒత్తిళ్లకు లొంగుతున్నారా?.. నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారా?.. వారు చేసే తప్పులకు వంత పాడుతున్నారా?.. సరిచేయాల్సిన బాధ్యతను ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారా?.. కారణాలేవైనా కొందరు సివిల్ సర్వెంట్లు ఆరోపణలను మూటగట్టుకుంటున్నారు.


ఉమ్మడి రాష్ట్రంలో శ్రీలక్ష్మి జైలుకెళ్లారు. బీపీ ఆచార్య విచారణను ఎదుర్కొన్నారు. తెలంగాణలో సోమేశ్ కుమార్, రజత్ కుమార్, ప్రభాకర్ రావు, ఏపీలో సంజయ్ వంటి అధికారులు అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్నారు. సీబీఐ, ఈడీ, ఏసీబీ కేసుల చుట్టూ తిరుగుతున్నారు.



## హాట్ టాపిక్‌గా ఐఏఎస్, ఐపీఎస్‌ల తీరు

## కేసుల్లో ఇరుక్కుంటున్న సివిల్ సర్వెంట్లు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రాసిక్యూషన్ ఎదుర్కొంటున్న ఫస్ట్ ఐఏఎస్ ఆఫీసర్ అరవింద్ కుమార్. 'ఫార్ములా ఈ' కార్ రేసు కేసులో ఆయనను ప్రాసిక్యూషన్ చేసేందుకు డీవోపీటీ అనుమతిచ్చింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆయనను రెవెన్యూ శాఖ (విపత్తు నిర్వహణ స్పెషల్ సీఎస్) పోస్టు నుంచి తప్పించి పక్కనబెట్టింది. ఏ క్షణమైనా అరవింద్ కుమార్‌ను ఏసీబీ విచారణకు పిలిచే చాన్స్ ఉంది. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయనున్నది.



వివాదాల్లో చిక్కుకున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వ్యవహార శైలిపై కలం 360 డిగ్రీస్ ...

తెలంగాణ బ్యూరో, కలం

# ట్రబుల్స్‌లో బిగ్ బాస్‌లు



### అరవింద్ కుమార్ (ఐఏఎస్)
### 'ఫార్ములా ఈ' రేసు

గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో నిర్వహించిన 'ఫార్ములా ఈ'కారు రేసులో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఏసీబీ, మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ చేపట్టాయి. ఈ కేసులో ఐఏఎస్ అరవింద్ కుమార్ ఏ2గా ఉన్నారు. ఆయనను ప్రాసిక్యూట్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల అనుమతి ఇచ్చింది.



- 'ఫార్ములా ఈ'కారు రేసుకు ఏస్ నెక్ట్స్ జెన్ కంపెనీ స్పాన్సర్‌గా వ్యవహరించింది. హైదరాబాద్‌లో నాలుగు సీజన్లు నిర్వహించేందుకు 'ఫార్ములా ఈ' ఆపరేషన్స్ కంపెనీ, ఏస్ నెక్ట్స్ జెన్, తెలంగాణ ప్రభుత్వం మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది.
- 2023 ఫిబ్రవరిలో నిర్వహించిన ఫస్ట్ సీజన్‌లో నష్టం వచ్చిందన్న కారణంతో ఏస్ నెక్ట్స్ జెన్ అర్ధాంతరంగా తప్పుకుంది.
- ఏస్ నెక్ట్స్ జెన్ తప్పుకోవడంతో హెచ్ఎండీఏ నిధుల ద్వారా రేసు నిర్వహించాలని అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ (ఏ1), ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ నిర్ణయం.
- ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే 'ఫార్ములా ఈ'ఆపరేషన్స్‌కు రూ.54.88 కోట్లు బదిలీ.
- 2024 జనవరి, ఫిబ్రవరిలో రెండుసార్లు అరవింద్ కుమార్‌ను విచారించిన ఏసీబీ.
- 2024 జులైలో నిధుల బదిలీకి సంబంధించి ఈడీ ఎంక్వైరీ.

రాజకీయ ఒత్తిళ్లపై క్లాసులు చెప్పి..! 2లో

రిటైర్డ్ ఐఏఎస్ సోమేశ్ కుమార్‌పై జీఎస్టీ స్కామ్ కేసు నడుస్తున్నది. ఇందులో ఆయన ఏ5గా ఉన్నారు.



### సోమేశ్ కుమార్ (రిటైర్డ్ ఐఏఎస్)
### జీఎస్టీ స్కామ్

- రెవెన్యూశాఖ(కమర్షియల్ ట్యాక్సెస్) స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పని చేసినప్పుడు సోమేశ్ కుమార్ జీఎస్టీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)లో రూ.వెయ్యి కోట్ల నుంచి రూ.1,400 కోట్ల వరకు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణ.
- జీఎస్టీ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయించి, కొన్ని కంపెనీలకు అనుచిత ఐటీసీ ట్రాన్స్‌ఫర్ చేసి, రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం కలిగించారని అభియోగాలు.
- ఈ స్కామ్‌పై 2024 జులైలో హైదరాబాద్ పోలీస్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్)లో ఎఫ్ఐఆర్. తర్వాత కేసు దర్యాప్తు సీఐడీకి బదిలీ.

ఫోన్ ట్యాపింగ్ కేసులో రిటైర్డ్ ఐపీఎస్ ప్రభాకర్ రావు ఏ1గా ఉన్నారు. గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో 2023 నవంబర్‌లో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్‌గా నియమితులయ్యారు. ఎస్ఐబీ ఆధ్వర్యంలో రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, రియల్టర్లు, సినీ ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేసినట్టు ఆరోపణలున్నాయి. 2024 మార్చిలో కేసు నమోదైంది.



### ప్రభాకర్ రావు (రిటైర్డ్ ఐపీఎస్)
### ఫోన్ ట్యాపింగ్

- సుప్రీంకోర్టు ఆదేశాలతో 2025 డిసెంబర్‌లో సిట్ ఎదుట ప్రభాకర్ రావు సరెండర్.
- ఆయనను దాదాపు రెండు వారాలు విచారించిన సిట్. ప్రస్తుతం బెయిల్‌పై బయటే..

కలం
26-02-2026, గురువారం

360° SINGLE TOPIC

# సివిల్ సర్వెంట్లు - వివాదాలు

02




## క్విడ్ ప్రో కో ఆరోపణలు

### రజత్ కుమార్ (రిటైర్డ్ ఐఏఎస్)



రిటైర్డ్ ఐఏఎస్ రజత్ కుమార్ గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా పని చేశారు. ఆ టైమ్‌లో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన మేఘా ఇంజనీరింగ్ కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చారని ఆరోపణలు ఉన్నాయి.

- రజత్ కుమార్ కుమార్తె పెళ్లి ఖర్చుల కింద మేఘా ఇంజనీరింగ్ కంపెనీ రూ.50 లక్షలు చెల్లించినట్టు ఆరోపణలు వచ్చాయి.
- కాళేశ్వరం ప్రాజెక్టులో మేఘా కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చినందుకు, క్విడ్ ప్రో కో కింద రజత్ కుమార్‌కు ముడుపులు అందాయని ఆరోపణలు.
- దీనిపై ఢిల్లీ హైకోర్టులో 2022 సెప్టెంబర్‌లో పిటిషన్ ఫైల్ అయింది. ఆరోపణలు వచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదని డీవోపీటీపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.
- దర్యాప్తు జరుగుతోందని హైకోర్టుకు నాటి బీఆర్ఎస్ సర్కార్ చెప్పినప్పటికీ, ఎలాంటి కేసు నమోదు కాలేదు.




## కరప్షన్ కేసు

### సంజయ్ (ఐపీఎస్)



ఏపీలో ఫైర్ సర్వీసెస్ డీజీ, సీఐడీ అడిషనల్ డీజీగా పని చేసిన ఐపీఎస్ సంజయ్‌పై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఆయనపై ఏసీబీ కేసు నమోదు చేయడంతో సర్వీస్ నుంచి సస్పెండ్ చేశారు.

- ఫైర్ సర్వీసెస్‌లో ఉన్నప్పుడు 'అగ్ని' వెబ్ పోర్టల్, యాప్ తయారీలో టెండర్ నిబంధనలు పాటించకుండా ప్రైవేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చినట్టు ఆరోపణలు.
- సీఐడీలో ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు అలాట్ అయిన ఫండ్స్‌ను దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలు.
- 2024 డిసెంబర్‌లో ఏసీబీ కేసు, అరెస్టు.. సస్పెన్షన్.
- 2025 డిసెంబర్‌లో ఏసీబీ కోర్టు బెయిల్.
- 2026 మే వరకు సస్పెన్షన్ పొడిగింపు.

## ఓబుళాపురం మైనింగ్ కేసు




### శ్రీలక్ష్మి (ఐఏఎస్)

- ఇనుప ఖనిజం తవ్వకాలకు సంబంధించి ఓఎంసీకి 2007లో అప్పటి వైఎస్ ప్రభుత్వం మైనింగ్ అనుమతులు ఇచ్చింది.
- ఆనాడు గనుల శాఖ కార్యదర్శిగా ఉన్న శ్రీలక్ష్మి.. ఈ ఫైల్ తన వద్దకు వచ్చినప్పుడు 'క్యాప్టివ్ మైనింగ్' (సొంత పరిశ్రమల అవసరాలకు మాత్రమే ఖనిజాన్ని వాడుకోవడం) అనే నిబంధనను ఉద్దేశపూర్వకంగా తొలగించి, అక్రమాలకు పాల్పడ్డారని సీబీఐ ఆరోపణ.
- శ్రీలక్ష్మి గనుల శాఖ కార్యదర్శిగా ఉన్న టైమ్‌లో ఆమె మరిది కూడా భారీగా అక్రమాస్తులు సంపాదించినట్టు సీబీఐ ఆరోపణ.
- శ్రీలక్ష్మిని నిర్దోషిగా తేలుస్తూ 2022లో తెలంగాణ హైకోర్టు తీర్పు. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో సీబీఐ పిటిషన్.
- శ్రీలక్ష్మి పాత్రను తేల్చాలని 2025 మేలో తెలంగాణ హైకోర్టుకు సుప్రీంకోర్టు ఆదేశం. అదే ఏడాది జులైలో శ్రీలక్ష్మి డిశ్చార్జ్ పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు.
- హైకోర్టు తీర్పుపై సుప్రీంలో శ్రీలక్ష్మి సవాల్. ట్రయల్ కోర్టులోనే (సీబీఐ కోర్టు) తేల్చుకోవాలని సుప్రీం తీర్పు.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసు నమోదైంది. దీనిపై సీబీఐ విచారణ చేపట్టింది. ఇందులో ఐఏఎస్ శ్రీలక్ష్మి (ఏ6) నిందితురాలిగా ఉన్నారు.

ఎమ్మార్ స్కామ్‌లో ఏ1గా, జగన్ అక్రమాస్తుల కేసులో ఏ9గా రిటైర్డ్ ఐఏఎస్ బీపీ ఆచార్య నిందితుడిగా ఉన్నారు. ఈ రెండు కేసులనూ సీబీఐ విచారిస్తున్నది.




## ఎమ్మార్ స్కామ్

### బీపీ ఆచార్య (రిటైర్డ్ ఐఏఎస్)



- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ సర్కార్ హయాంలో హైదరాబాద్ గచ్చిబౌలిలో 535 ఎకరాల్లో హైఎండ్ టౌన్‌షిప్ నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఎమ్మార్ ప్రాపర్టీస్, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) మధ్య ఒప్పందం కుదిరింది.
- ఈ ప్రాజెక్టులో మొదట ఎమ్మార్‌కు 75%, ఏపీఐఐసీకి 25% వాటా నిర్ణయించారు. తర్వాత ఏపీఐఐసీ వాటాను 6.5 శాతానికి తగ్గించారు. ప్రైవేట్ కంపెనీలకు అనుచిత లబ్ధి చేకూర్చి, ప్రభుత్వానికి నష్టం చేశారని ఆరోపణలు రావడంతో సీబీఐ దర్యాప్తు చేపట్టింది. ఆనాడు ఏపీఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చేసిన బీపీ ఆచార్యను ఏ1గా పేర్కొంది.
- ఇక జగన్ అక్రమాస్తుల కేసులో బీపీ ఆచార్య ఏ9గా ఉన్నారు. 2005 నుంచి 2009 వరకు ఏపీఐఐసీలో పని చేసిన బీపీ ఆచార్య.. ఆ టైమ్‌లో పలు కంపెనీలకు తక్కువ ధరకు భూములు కేటాయించారని, అవి జగన్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాయని.. ఫలితంగా క్విడ్ ప్రో కో జరిగిందని సీబీఐ ప్రధాన ఆరోపణ.

## బ్యూరోక్రాట్లకు రాజకీయ ఒత్తిళ్లు

"ప్రొబేషనరీ ముగించుకున్న యువ ఐఏఎస్‌లకు హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి (ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ) కేంద్రంలో ఓరియెంటేషన్ ఇవ్వడం రెగ్యులర్ ప్రాక్టీస్. పరిపాలనలో మెలకువలు, ఎదురయ్యే సవాళ్లు, ప్రజలకు సేవలందించే టాస్క్, పాలసీల రూపకల్పన, ప్రజలతో కలిసిపోవడం, వారి సమస్యలను అర్థం చేసుకోవడం.. వీటన్నింటినీ సీనియర్ ఐఏఎస్‌లు వివరిస్తారు. ఆరోపణలు ఎదుర్కొన్న బీపీ ఆచార్య గతంలో ఈ సెంటర్‌కు డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరించారు. ఆ సమయంలో కొత్త ఐఏఎస్ బ్యాచ్ ఆఫీసర్లకు ప్రాక్టికల్ సమస్యలను వివరించారు. రాజకీయ ఒత్తిళ్ల సవాళ్లను అధిగమిస్తూ బ్యాలెన్స్‌గా నెట్టుకురావడం పెద్ద టాస్క్ అని నాడు బీపీ ఆచార్యతో పాటు సీనియర్ ఆఫీసర్లు పేర్కొన్నారు.

